సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శనివారం । 29 । జూన్ । 2024



రూ.1,00,400 విరాళం


అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి కుంచపూడి సుధారాణి (హైదరాబాద్) శుక్రవారం రూ.1,00,400 విరాళం సమర్పించారు.



శిరసా ధరించాల్సిందే..

రోడ్డు ప్రమాదాల్లో ద్విచక్ర వాహనదారులు మృతి చెందుతున్న నేపథ్యంలో హైకోర్టు జోక్యంతో హెల్మెట్ ధారణను తప్పనిసరి చేసేందుకు అధికారులు ఉద్యుక్తులవుతున్నారు. - 8లో ▸

డెల్టాలకు 11,110 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 11,110 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,090, మధ్య డెల్టాకు 2,220, పశ్చిమ డెల్టాకు 5,800 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 9.50 అడుగులకు చేరింది.

ఎన్నాళ్లీ సాగుతీత?

- రైతుకు అందని ధాన్యం సొమ్ము
- 14 వేల మంది ఎదురుచూపులు
- రావాల్సింది రూ.270 కోట్లు
- విడుదల కాని భరోసా డబ్బు
- రైతులకు పెట్టుబడి సాయంగా ఏడాదికి రూ.20 వేల హామీ
- చంద్రబాబు సూపర్ సిక్స్ ఎన్నికల వాగ్దానాలలో ఇది ఒకటి
- గత ప్రభుత్వంలో ఖరీఫ్ సాగు ఆరంభంలోనే రూ.7,500 ప్రోత్సాహం
- పెట్టుబడికి సొమ్ము కోసం ఖరీఫ్ రైతుల విలవిల



అల్లవరం మండలం దేవగుప్తంలో దుక్కులు పూర్తికాని పొలం

సాక్షి అమలాపురం: తొలకరి సాగుకు కాలువల ద్వారా నీరు విడుదల చేసి నెల రోజులు కావస్తోంది. వ్యవసాయ శాఖ ముందస్తుగానే విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచింది. కానీ రైతులకు సాగుకు అవసరమైన పెట్టుబడి అందించడంలో ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. రైతుకు ఇస్తానన్న ఆర్థిక సాయం కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ ద్వారా అందించినా... రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నుంచి మాత్రం ఉలుకూ పలుకూ లేకుండా ఉంది. అలాగే రబీ ధాన్యం అమ్మకాలు చేసిన రైతులు సొమ్ము కోసం ఎదురుతెన్నులు చూస్తున్నారు. ఈ రెండూ రైతులకు అందకపోవడంతో జిల్లాలో ఖరీఫ్ సాగు మందకొడిగా సాగుతోంది.

జిల్లాలో వరి ఆయకట్టు ఖరీఫ్‌లో 1,68,780 ఎకరాలు. ఇప్పటి వరకు 5,624 ఎకరాలలో నారుమడులు పడాల్సి ఉండగా 4,222.45 ఎకరాల్లో నారుమడులు వేశారు. 2,259 ఎకరాల్లో వెదజల్లు పద్ధతిలో సాగు చేస్తున్నారు. ఇంతవరకు కేవలం 1,228 ఎకరాల్లో మాత్రమే నాట్లు పూర్తయ్యాయి. జూలై మొదటి వారంలో నాట్లు పూర్తయితే అక్టోబరు 15 తరువాత వాయుగుండం, తుపాన్ల బారిన ఖరీఫ్ వరి చేలు పడవని ప్రభుత్వ ఉద్దేశం. అయితే జిల్లాలో అనుకున్న దాని కన్నా సాగు ఆలస్యం కావడానికి అందుబాటులో నీరు, విత్తనాలు, ఎరువులు ఉన్నా చేతిలో సొమ్ము లేకపోవడమే ప్రధాన అవరోధంగా మారింది.

ధాన్యం బకాయి రూ.270 కోట్లు

జిల్లాలో రబీ ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా సాగాయి. దిగుబడి అంచనాలకు మించి వచ్చింది. రబీ దిగుబడులు అందుతున్న సమయంలోనే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందుచూపుతో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. జిల్లాలో 377 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించగా, సుమారు 328 కేంద్రాల ద్వారా ధాన్యాన్ని సేకరించారు. ధాన్యం సేకరణ వేగంగా జరగడం, తొలి దఫా సొమ్ము రూ.80 కోట్ల వరకు రైతుల ఖాతాలో జమ కావడం చకచకా జరిగాయి. తరువాత నుంచి సొమ్ము విడుదల కాలేదు. జిల్లాలో సుమారు 14 వేల మంది రైతులకు రూ.270 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. దాదాపు మే మొదటి వారం నుంచి చెల్లింపులు జరగడం లేదు. దీనిపై రైతులు మొర పెట్టుకుంటున్నా ప్రభుత్వం నుంచి సరైన స్పందన రాకపోవడంతో అధికారులకు ఎటువంటి సమాధానం చెప్పాలో పాలుపోవడం లేదు. కలెక్టరేట్ వద్ద సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ జరుగుతున్న సమయంలో జిల్లాలో అల్లవరం మండలానికి చెందిన రైతులు కోనసీమ రైతు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ హిమాన్షు శుక్లాకు వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏపీ కౌలు రైతుల సంఘం నాయకులు ధర్నా చేశారు.

రైతుకు అండగా వైఎస్సార్ సీపీ సర్కారు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కలిపి రైతులకు ఏటా రూ.13,500 రైతులకు ప్రోత్సాహంగా అందించేది. ఈ నిధులను మూడు దఫాలుగా రైతుల ఖాతాలో జమ చేసేవారు. వైఎస్సార్ సీపీ 2019 ఎన్నికల మేనిఫెస్టోలో రైతు భరోసాగా రూ.12,500 అందజేస్తానని చెప్పింది. అయితే అధికారంలోకి వచ్చిన తరువాత ఏడాదికి రూ.13,500 చొప్పున అందజేసింది. రైతులకు ఖరీఫ్‌లో పంట పెట్టుబడి, వరి కోతలకు, రబీలో పెట్టుబడికి కొంతవరకు వెసులుబాటు కలిగేలా మే, అక్టోబర్, జనవరిలో నెలలో ఈ సొమ్ము వారి ఖాతాలలో నేరుగా జమ చేసేది. దీనివల్ల పెద్ద రైతుల కన్నా సన్న, చిన్నకారు రైతులకు అధికంగా ప్రయోజనం కలిగేది. మరీ ముఖ్యంగా ముందస్తు సాగు జూన్ 1న మొదలు పెట్టేందుకు వీలుగా ఖరీఫ్ సాగు ఆరంభంలో మే నెలలోనే రైతుల ఖాతాలలో రూ.7,500 వరకు జమ చేయడంతో వారి సాగు పెట్టుబడికి చాలా వరకు అక్కరకు వచ్చేది.

స్పందించని ప్రభుత్వం

జిల్లాలో వైఎస్సార్ రైతు భరోసా కింద ఏడాదికి సగటున 1,45,890 మందికి రైతులకు మూడు దఫాలుగా రూ.196.95 కోట్ల వరకు వారి ఖాతాలో జమ చేసేవారు. **జిల్లాలో ఐదేళ్ల కాలంలో వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కలిపి రూ.482.58 కోట్లు రైతులకు ప్రోత్సాహ నిధిగా అందచేసిన విషయం తెలిసిందే. ఏటా తొలి విడతగా** పీఎం సమ్మాన్ నిధి కలిపి రూ.7,500 చొప్పున రూ.109.41 కోట్లు అందజేసేవారు. దీనిలో పీఎం కిసాన్ రూ.2 వేలు కాగా, రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసాగా రూ.5,500 ఇచ్చేది. ఎన్నికల ముందు టీడీపీ తొలుత ప్రకటించిన సూపర్ సిక్స్‌లో ప్రతి రైతుకు ఏటా రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం చేస్తామని హామీ ఇచ్చారు. తరువాత టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి మేనిఫెస్టోలో కూడా ఇదే హామీ ఇచ్చారు. పీఎం కిసాన్ నిధితోపాటు మూడుసార్లు రైతు ఖాతాలలో జమ చేయాల్సి వస్తే రాష్ట్ర ప్రభుత్వం కనీసం రూ.5 వేల వరకు అందించాల్సి ఉంది. ఈ విధంగా చూస్తే సాగు ఆరంభానికి ముందు అంటే ఇప్పటికే రైతులకు ఆర్థిక సాయంగా రూ.72.94 కోట్లు అందించాల్సి ఉంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలా ఖరీఫ్ సాగుకే పెద్ద ఎత్తున సాయం అందించాలంటే ఒక్కొక్క రైతుకు రూ.10,200 చొప్పున చూసుకున్నా రూ.148.80 కోట్లు అందజేయాల్సి ఉంది. అయితే దీనిపై ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎటువంటి ప్రకటనా విడుదల కాకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. పీఎం కిసాన్ నిధులతోపాటు వీటిని కూడా విడుదల చేస్తారని ఆశపడినా ఫలితం లేకుండా పోయింది.

రూ.రెండు లక్షల వరకు రావాలి



నేను గత ఏప్రిల్ నెలలోనే ధాన్యం అమ్మాను. ఇప్పటి వరకు సొమ్ము రాలేదు. నేను మూడు ఎకరాల్లో సాగు చేశాను. నాకు రూ.రెండు లక్షల వరకు ధాన్యం సొమ్ము రావాల్సి ఉంది. అది వస్తే ఖరీఫ్ సాగు పెట్టుబడికి అప్పు చేయాల్సిన అవసరం చాలా వరకు తగ్గుతుంది.

– చిట్టుమేను కాటమరాజు,
రైతు, దేవగుప్తం, అల్లవరం మండలం

న్యూస్‌రీల్

వైభవంగా సౌరయాగం



కేశనకుర్రులో స్వామికి రుద్రాభిషేకం నిర్వహిస్తున్న పండితులు

ఐ.పోలవరం: కేశనకుర్రుపాలెంలో కొలువైన రాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వర ఆలయంలో శ్రీరుద్ర, శతచండీ మహా సౌరయాగం అంగరంగ వైభవంగా జరుగుతోంది. శుక్రవారం ఆలయంలో యాగ ఆచార్యులు ఆగమ విశారద కాలకూరి దుర్గాప్రసాద్‌శర్మ, యాగబ్రహ్మ కాళ్లకూరి కామేశ్వరశర్మ, వెలవల్లి చంద్రశేఖర శర్మ ఆధ్వర్యంలో పలువురు పండితులు యాగంలో పాల్గొన్నారు. ఉదయం గణపతిపూజ, పుణ్యాహవచనం, రుద్రాభిషేకం, శత సహస్ర బిల్వార్చన, చండీహోమం, రుద్రహోమం, మహాసౌర హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ యాగాన్ని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ఆవరణలో యాగాన్ని తిలకించేందుకువచ్చిన భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.

అదనపు జిల్లా కోర్టు ఏర్పాటుకు గెజిట్ నోటిఫికేషన్

రామచంద్రపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో అదనపు జిల్లా కోర్టు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసినట్టు రామచంద్రపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఏజీపీ పిల్లి మురళీమోహన్ వెంకటరమణ శుక్రవారం విలేకరులకు తెలిపారు. దీనికి సంబంధించి జీఓ నంబర్ 71 విడుదల అయిందన్నారు. ఈ జీఓ ప్రతులను బార్ అసోసియేషన్ కార్యవర్గం, న్యాయవాదులతో కలసి సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావుకు అందజేశారు. అనంతరం సీనియర్ న్యాయవాది ఆర్‌వీజీ సుబ్బారావు ఆధ్వర్యంలో న్యాయవాదులకు, కోర్టు సిబ్బందికి, కక్షిదారులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పలివెల సత్యనారాయణ, జూనియర్ న్యాయవాదుల ప్రతినిధి పిల్లా పృథ్వీరామయ్య పాల్గొన్నారు.

శాస్త్రీయ విధానాలతో అధిక దిగుబడులు

రాజానగరం: శాస్త్రీయ విధానాలు పాటిస్తే ఖరీఫ్‌లో వరి, మొక్కజొన్న, అపరాల వంటి పంటల్లో నాణ్యమైన, స్థిరమైన దిగుబడులు సాధించవచ్చని పెద్దాపురం వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ రామభద్రరాజు అన్నారు. దివాన్ చెరువులోని ఏరువాక కేంద్రం ఆధ్వర్యాన శుక్రవారం నిర్వహించిన శిక్షణ – సందర్శన కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు సమన్వయంతో పని చేస్తే, రైతులు మేలైన దిగుబడులు సాధిస్తారని అన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పంటల పరిస్థితి, రకాలు, నారుమడులు, సమస్యలపై ఈ సందర్భంగా నివేదించారు. సాగు పద్ధతులపై వివరించారు.

అన్నవరం దేవస్థానం ఈఓకు కీలక బాధ్యతలు



ఈఓ రామచంద్ర మోహన్

అన్నవరం: దేవస్థానం ఈఓ, దేవదాయ, ధర్మదాయ శాఖ అడిషనల్ కమిషనర్ కె.రామచంద్ర మోహన్‌కు ఆ శాఖ కమిషనర్ కార్యాలయంలో కీలక బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం ఆ శాఖలోని పెద్ద ఆలయాలు మినహా మిగిలిన ఆలయాల ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం ఫైల్స్ (ఈ–సెక్షన్) ఆయన పరిశీలిస్తారు. రాష్ట్రంలోని గ్రూప్ టెంపుల్స్ ఈఓల నుంచి ఏసీ, డీసీ, రీజినల్ జాయింట్ కమిషనర్ల వరకూ ఆయన పరిధిలోకి వస్తారు. వారి సర్వీసు అంశాలు, సెలవులు, విచారణలు ఆయనే చూడాల్సి ఉంటుంది. ఆయన పరిశీలన తర్వాతే కమిషనర్ వద్దకు ఆ ఫైల్స్ వెళ్తాయని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ విధులు సోమవారం నుంచి గురువారం వరకూ కమిషనర్ కార్యాలయంలో నిర్వహిస్తానని రామచంద్ర మోహన్ శుక్రవారం తెలిపారు. శుక్ర, శనివారాల్లో అన్నవరం దేవస్థానంలో విధులు నిర్వహిస్తానని చెప్పారు. ఇక్కడ తక్కువ రోజులు ఉంటున్నప్పటికీ ఈ–ఫైలింగ్ ద్వారా వ్యవహారాలు నడుస్తున్నందున ఫైల్స్ పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్లియర్ చేయనున్నారు.

పీజీ సెట్‌లో సుష్మకు ఫస్ట్ ర్యాంక్



ఫస్ట్ ర్యాంకర్ సుష్మకు ధ్రువపత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్ రామచంద్ర

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పోస్టు గ్రాడ్యుయేట్ ప్రవేశ పరీక్షల్లో (పీజీ సెట్) స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల బయో టెక్నాలజీ విద్యార్థిని ఎస్‌టీవీ సుష్మ రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్ కైవసం చేసుకుంది. ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే శుక్రవారం ఈ విషయం తెలిపారు. ఈ పరీక్షల్లో తమ విద్యార్థులు పది మందికి పైగా సింగిల్ డిజిట్ ర్యాంకులు, 15 మందికి పైగా రెండంకెల ర్యాంకులు సాధించారని వివరించారు. అనేక మంది మూడంకెల ర్యాంకులు సాధించారన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

సత్యదేవునికి రూ.1.65 కోట్ల హుండీ ఆదాయం

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి దేవస్థానానికి గడచిన 29 రోజులకు హుండీల ద్వారా రికార్డు స్థాయిలో రూ.1,65,05,994 ఆదాయం సమకూరింది. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్ర మోహన్ ఈ విషయం తెలిపారు. దేవస్థానంలోని హుండీలను శుక్రవారం తెరచి, భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. నగదు రూ.1,59,57,389, నాణాలు రూ.5,48,605 వచ్చాయి. వీటితో పాటు 51 గ్రాముల బంగారం, 633 గ్రాముల వెండి వచ్చాయి. ఇంకా అమెరికన్ డాలర్లు 286, భూటాన్ కరెన్సీ 10, సౌదీ అరేబియా రియల్స్ 1, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ కువైట్ దీనార్లు 3, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దీనార్లు 10, దక్షిణాఫ్రికా ర్యాండ్లు 450, మలేషియా రింగిట్ 528, సింగపూర్ డాలర్లు 10 చొప్పున లభించాయి. వాస్తవానికి పెద్దగా పర్వదినాలు లేకపోవడంతో జ్యేష్ఠ మాసంలో సత్యదేవుని ఆలయానికి భక్తుల తాకిడి అంతగా ఉండదు. అయితే దీనికి భిన్నంగా ఈసారి సత్యదేవుని ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఈ నెల 13వ తేదీ వరకూ విద్యా సంస్థలకు సెలవులు కావడంతో సత్యదేవుని సన్నిధికి తల్లిదండ్రులతో కలసి విద్యార్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. దీంతో పాటు శని, ఆదివారాలు, దశమి, ఏకాదశి, పౌర్ణమి తదితర పర్వదినాల్లో కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. వారందరూ సత్యదేవుని దర్శించి హుండీల్లో కానుకలు సమర్పించడంతో పెద్ద మొత్తంలో హుండీ ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. ఈ 29 రోజుల్లో రోజుకు సరాసరిన రూ.5,69,172 ఆదాయం సమకూరిందని చైర్మన్, ఈఓ తెలిపారు. హుండీల ఆదాయం లెక్కింపు కార్యక్రమంలో వీరితో పాటు డిప్యూటీ ఈఓ రమేష్‌బాబు, దేవస్థానం సిబ్బందితో పాటు పలు స్వచ్ఛంద సంస్థల సిబ్బంది పాల్గొన్నారు. హుండీల ఆదాయాన్ని స్థానిక యూనియన్ బ్యాంక్‌లో జమ చేశారు.



హుండీల్లో వచ్చిన నగదును కట్టలు కడుతున్న సిబ్బంది

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

అధికారులకు కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశం

అమలాపురం రూరల్: డెంగీ, మలేరియా, డయేరియా వంటి కీటక జనిత వ్యాధులు ప్రబలకుండా శాఖల సమన్వయంతో ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో డెంగీ వ్యతిరేక మాసోత్సవం జూలై 1 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించడంపై లైన్ డిపార్టుమెంట్ అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుతుపవనాల ఆగమనం సందర్భంలో ఈ వ్యాధి ప్రబలే అవకాశాలు మెండుగా ఉన్నాయని అన్నారు. డెంగీ వ్యాధి నియంత్రణకు సమన్వయ కమిటీ అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. కీటక జనిత వ్యాధుల నియంత్రణ చర్యలపై అధికారులకు ఆయన దిశా నిర్దేశం చేశారు. గ్రామాల్లో పారిశుధ్యం, దోమల నియంత్రణ చర్యలపై ఫోకస్ పెట్టాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. రాపిడ్ కిట్ల సహకారంతో వ్యాధుల నిర్ధారణ పరీక్షలు ముమ్మరంగా చేపట్టి వ్యాధులు ప్రబలడానికి గల మూలాలను అన్వేషించి నివారణ చర్యలు పటిష్టం చేయాలన్నారు. పెద్ద పెద్ద నీటి గుంటలలో గంబూషియా చేప పిల్లలను మత్స్యశాఖ సహకారంతో వేసి దోమల ఉత్పత్తికి మూలమైన లార్వాలను తినే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతుల వసతి గృహాలలో ఆర్వో వాటర్ ప్లాంట్లను వినియోగిస్తూ సురక్షిత తాగునీటిని అందించాలన్నారు. జూలై, ఆగస్టు మాసాలలో కోనసీమ జిల్లాలో దోమల వ్యాప్తి, గోదావరి వరదలు వచ్చేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నందున దోమల నియంత్రణ చర్యలపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. కీటక జనిత, సీజనల్ వ్యాధుల నియంత్రణకు ఔషధాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. నీటి స్వచ్ఛత పరీక్షలకు, కెమికల్ టెస్టింగ్‌కు అవసరమైన పరికరాలను పురపాలక సంఘాలకు సరఫరా చేస్తామన్నారు. డెంగీ జ్వరం అనేది ఈడిస్ దోమ ద్వారా వ్యాపిస్తుందన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రెగ్యులర్‌గా తనిఖీలు నిర్వహిస్తూ అంగన్వాడీ కేంద్రాలలోని చిన్నారులు డెంగీ వ్యాధి బారిన పడకుండా పరిశుభ్రత చర్యలు, దోమల నివారణ చేపట్టాలని ఆదేశించారు. చికెన్, మటన్ దుకాణాల్లో ఫుడ్ సేఫ్టీ, పంచాయతీ కార్యదర్శులు తనిఖీలు నిర్వహించి పరిశుభ్రత అంశాలను తనిఖీ చేయాలని సూచించారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ ఎం.దుర్గారావు దొర, అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీహెచ్‌వీ భరతలక్ష్మి, సీపీఓ వెంకటేశ్వర్లు, డీపీవో డి.రాంబాబు, మున్సిపల్ కమిషనర్లు, ఐసీడీఎస్ పీడీ ఎం.ఝాన్సీరాణి, డీఈవో కమలకుమారి, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ సుమలత, డీసీహెచ్ ఎస్.కార్తీక్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్‌బాబు, సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు పి.జ్యోతిలక్ష్మి దేవి పాల్గొన్నారు.



డెంగీ వ్యతిరేక మాసోత్సవంపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శుక్లా

డయేరియాకు చెక్ పెడదాం..

- అతిసారతో ప్రాణానికి ప్రమాదం
- ఐదేళ్ల లోపు చిన్నారులకు ఈ సీజన్లో సోకే అవకాశం
- ఉధృత డయేరియాకు ఓఆర్ఎస్ సంజీవని
- 1 నుంచి ఆగస్టు 31 వరకు నివారణ కార్యక్రమాలు

రాయవరం: డయేరియాకు చెక్ పెట్టేందుకు అధికారులు కార్యాచరణ రూపొందిస్తున్నారు. సీజన్ మారే సమయంలో పిల్లలకు ఉధృత డయేరియా సోకే అవకాశముంది. ఒకప్పుడు మే, జూన్ నెలల్లో అధికంగా పిల్లలు ఉధృత డయేరియా (నీళ్ల విరేచనాలు) బారిన పడేవారు. ఆరు నెలల నుంచి ఏడాది లోపు చిన్నారులు ఈ సమస్యతో మరణించేవారు. ఇటీవల కాలంలో ఇటువంటి మరణాలు తగ్గుముఖం పట్టాయి. అయినప్పటికీ ప్రజలను అప్రమత్తం చేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ సిద్ధమవుతోంది. ఏటా డయేరియా పక్షోత్సవాలు జూలై 1 నుంచి 15 వరకు నిర్వహించేవారు. కాగా ఈ ఏడాది జూలై 1 నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు రెండు నెలల పాటు నిర్వహించాలని అధికారులు కార్యాచరణ రూపొందించారు. డయేరియాపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం, నీళ్ల విరేచనాలు అయిన చిన్నారులకు తక్షణ వైద్య సేవలు అందించడం, దీంతో పాటుగా డయేరియా ఉన్నా లేకున్నా అవసరమైన ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ టాబ్లెట్లు ఇంటింటికీ పంపిణీ చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం.

ఉధృత డయేరియా అంటే

సహజంగా మే, జూన్ నెలల్లో రోటా వైరస్ కారణంగా ఉధృత డయేరియా సోకుతుంది. తాగే నీరు, కలుషిత ఆహారం, ఇతర తినుబండారా ద్వారా రోటా వైరస్, ఈ–కోలై బ్యాక్టీరియా శరీరంలోకి ప్రవేశించి అతిసారం కలగజేస్తాయి. పిన్న, పెద్ద వయస్సుల వారికి సోకే అవకాశం ఉన్నా, పిల్లల్లో ప్రాణాంతకమవుతుంది. గతంలో డయేరియా కారణంగా ఏడాది లోపు చిన్నారుల్లో ఎక్కువ మంది మరణించేవారు. ఎండలోకి వెళ్లకుండా ఉండడం, కాచి చల్లార్చిన నీరు తాగడం, వేడివేడి ఆహార పదార్థాలు తీసుకోవడం ఎంతో ముఖ్యం. అపరిశుభ్ర ప్రాంతాల్లోని ఆహారాన్ని తీసుకోరాదు.

ఓఆర్ఎస్ సంజీవని

డయేరియా సోకిన చిన్నారులకు ఓఆర్ఎస్ ద్రావణం సంజీవని వంటిదని చెప్పవచ్చు. ఓఆర్ఎస్ ద్రావణం అందుబాటులోకి వచ్చి, ప్రజల్లో అవగాహన పెరిగిన తర్వాత డయేరియాతో చిన్నారుల మరణాలు చాలా వరకు తగ్గుముఖం పట్టాయి. మారుమూల ప్రాంతాల్లోనూ ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండడంతో, పిల్లలకు నీళ్ల విరేచనాలు అవుతున్నప్పుడు ఓఆర్ఎస్‌ను ఇస్తే డీహైడ్రేషన్‌కు గురి కాకుండా చూడవచ్చు.

కారణాలు

నీళ్ల విరేచనాలు, పలచగా అవుతుంటే డయేరియా (అతిసార వ్యాధి) అంటారు. వైద్య పరిభాషలో దీనిని గ్యాస్ట్రో ఎంటరైటిస్‌గా పిలుస్తారు. ఈ వ్యాధి జీర్ణవ్యవస్థకు సోకుతుంది. నీళ్ల విరేచనాలు నూటికి 70శాతం వైరస్ క్రిముల వల్ల వస్తాయి. కలుషితమైన నీటిని తాగటం, మలం మీద వాలిన ఈగలు ఆహార పదార్థాలపై వాలగా ఆ ఆహారాన్ని తీసుకోవడం వలన వివిధ రకాల బ్యాక్టీరియా, వైరస్‌లు శరీరంలోకి ప్రవేశించి విరేచనాలు అవుతాయి.



లక్షణాలు

- జీర్ణవ్యవస్థ పనితీరు అస్తవ్యస్తంగా ఉండి వాంతులు. విరేచనాలు అవుతాయి.
- నీళ్ల విరేచనాలు, విరేచనం పలుచగా కావటం, కడుపులో మెలిపెట్టినట్లు నొప్పి ఉంటుంది.
- నీరసం, వికారం, వాంతులు, శరీరంలో లవణాలు పోయి పిక్కలు నొప్పులు వస్తాయి.
- డీ హైడ్రేషన్ ప్రమాదం. నాడి వేగంగా లేదా బలహీనంగా కొట్టుకోవటం. నీరసం, నోరు, నాలుక, పిడచకట్టుకు పోవటం, శరీరం ఎండిపోవటం



- మూత్రం అసలు రాకపోవటం లేదా చాలా తక్కువగా రావటం, ముదురు పసుపు రంగులో రావటం.
- పెద్దల కంటే పిల్లలకు ఎక్కువగా ఇబ్బంది కరమైన పరిస్థితులు వస్తాయి.

విస్తృత అవగాహనకు

ఆశ కార్యకర్తలు..ఐదేళ్ల లోపు చిన్నారులున్న ప్రతి ఇంటికీ రెండు ఓఆర్ఎస్ ప్యాకెట్లు. 14 జింక్ టాబ్లెట్లు పంపిణీ చేయనున్నారు. పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, విలేజ్ హెల్త్ క్లినిక్స్, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఓఆర్ఎస్, జింక్ కార్నర్ ఏర్పాటు చేస్తారు. ప్రైవేట్ ఆస్పత్రులు, ప్రైవేట్ క్లినిక్‌లు, మెడికల్ కళాశాల, సీహెచ్‌సీల వద్ద ఓఆర్ఎస్– జింక్ కార్నర్ ఏర్పాటు చేస్తున్నారు. డయేరియా సోకిన పిల్లలకు 14 రోజుల పాటు జింక్ అందించడానికి చర్యలు తీసుకుంటున్నారు. డయేరియా రెండు, మూడు రోజుల్లో తగ్గినా జింక్ టాబ్లెట్లు తప్పనిసరిగా 14 రోజులు తీసుకునేలా అవగాహన కల్పించనున్నారు. ఐదేళ్లలోపు చిన్నారులున్న తల్లులకు అవగాహన కల్పిస్తారు. పాఠశాలల్లో అసెంబ్లీ సమయంలో చేతులు పరిశుభ్రం చేసుకునే విధానంపై ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది అవగాహన కల్పిస్తారు.

జిల్లాలో పరిస్థితి ఇదీ..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 0–5 సంవత్సరాల చిన్నారులు 1.19 లక్షల మంది ఉన్నారు. వీరి కోసం ఇంటింటికీ ఓఆర్ఎస్–జింక్ టాబ్లెట్లను జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు పంపిణీ చేస్తారు. ప్రతి రోజు ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు గృహాల సందర్శన ఉంటుంది. అతిసారం సోకిన చిన్నారులకు వారి లక్షణాల ఆధారంగా ట్రీట్‌మెంట్ అందజేస్తారు. అవసరమైన పక్షంలో ఆస్పత్రికి తరలిస్తారు. జిల్లాలో రెండు ఏరియా ఆస్పత్రులు, తొమ్మిది సీహెచ్‌సీలు, 56 పీహెచ్‌సీలు, 519 సబ్‌సెంటర్లు, 1,726 అంగన్‌వాడీ కేంద్రాలు, 131 ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఓఆర్ఎస్–జింక్ కార్నర్‌లు ఏర్పాటు చేస్తారు. జిల్లాలో 3,83,452 ఓఆర్ఎస్ ప్యాకెట్లు, 3,00,862 జింక్ టాబ్లెట్లు అందుబాటులో ఉన్నాయి.

గతేడాది పరిస్థితి ఇదీ

చిన్నారుల్లో గతేడాది ఎటువంటి డయేరియా మరణాలు సంభవించలేదు. గతేడాది నిర్వహించిన క్యాంపైన్‌లో 0–5 వయస్సు చిన్నారుల్లో కేవలం 78 కేసులు మాత్రమే నమోదయ్యాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

వ్యాధి లక్షణాలు గుర్తించి దాహం పెరిగితే ఓఆర్ఎస్ తాగించాలి. ఒక ప్యాకెట్ పౌడర్‌ను పరిశుభ్రమైన నీరు లేదా కాచి చల్లార్చిన లీటర్ నీటిలో కలుపుకుని తాగాలి. నీళ్ల విరేచనాలు అయ్యే చిన్నారులకు తల్లిపాలు ఆపకూడదు. విరేచనాలు అయ్యే పెద్ద వారికి కారం, మసాలా వంటి ఘాటు పదార్థాలు పెట్టకూడదు. ద్రవరూపంలో ఉండే ఆహారం అందజేయాలి. మజ్జిగ, పాలు, బార్లీనీరు, పలచగా తయారు చేసిన సగ్గుబియ్యం, రాగి జావ, కొబ్బరినీళ్లు, నిమ్మరసం, సోయాబీన్స్ రసం, ఇతర పండ్ల రసాలు ఇవ్వొచ్చు. మలమూత్ర విసర్జన పిదప, భోజనం చేసే ముందు తప్పనిసరిగా సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవాలి. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. రోడ్లపైన, మురుగు కాలువ పక్కన, తోపుడు బండ్లపై విక్రయించే ఆహార పదార్థాలను, ఈగలు వాలిన ఆహార పదార్థాలను తినకూడదు. వంట పాత్రలపై ఎల్లప్పుడూ మూతలు పెట్టుకుని ఉంచుకోవాలి. చెరువులు, బావుల్లో నీటిని తాగరాదు.

నివారించదగినదే



డయేరియా నివారించదగినదే. ప్రజల్లో అవగాహన పెరగడంతో కేసులు తగ్గుముఖం పట్టాయి. నీళ్ల విరేచనాలు అవుతుంటే ఓఆర్ఎస్ ద్రావణాన్ని తప్పనిసరిగా పట్టించాలి. జింక టాబ్లెట్లు వాడడం ద్వారా వ్యాధినిరోధక శక్తి పెరిగి, ప్రాణాపాయం తప్పించవచ్చు.

– డాక్టర్ బీవీవీ సత్యనారాయణ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, అమలాపురం

ముందస్తు చర్యలపై అవగాహన



డయేరియా సోకకుండా ముందస్తు చర్యల గురించి అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని ఆరోగ్య కేంద్రాల వైద్యులు, వైద్య సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం. బాధితులకు ఆరోగ్య కేంద్రాల్లోనే సెలైన్లు పెట్టేలా ఏర్పాట్లు చేశాం.

– డాక్టర్ దుర్గారావుదొర, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, అమలాపురం

క్లుప్తంగా

వ్యక్తి దుర్మరణం

సామర్లకోట: స్థానిక అచ్చంపేట ఏడీబీ రోడ్డులో కిర్లంపూడి మండలం సోమరాయణంపేటకు చెందిన ఆడారి మూసిల్లియ్య(35) మృతిచెందిన సంఘటన ఇది. ఎస్సై మూర్తి కథనం ప్రకారం మూసిల్లియ్య మూడు నెలలుగా కాకినాడ పోర్టులో రోజు వారీ కూలీగా పని చేస్తున్నాడు. రోజూ మాదిరిగానే గురువారం విధులు ముగించుకొని రాత్రి మోటారు సైకిలుపై ఇంటికి తిరిగి వస్తూ ఉండగా గుర్తు తెలియని వాహనం ఏడీబీ రోడ్డు ఇస్కాన్ టెంపుల్ ఎదురుగా ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య ఆడారి దేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎస్సై దర్యాప్తు చేస్తున్నారు.

సెక్యూరిటీ గార్డు మృతిపై కేసు నమోదు

కాకినాడ రూరల్: కాకినాడ ఎస్ఎఫ్‌సీఎల్ గేటు వద్ద సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న కె.గంగవరం మండలం ఉడిమూడి గ్రామానికి చెందిన తడల వెంకట సూర్యనారాయణ(46)మృతి పట్ల సర్పవరం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు వివరాల ప్రకారం విధుల్లో ఉండగా సూర్యనారాయణ గురువారం తెల్లవారు జామున పడిపోవడంతో ఆస్పత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ మృతి చెందడంతో మృతుని భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్సై నాగేశ్వరరావు శుక్రవారం తెలియజేశారు.

వివాహిత ఆత్మహత్య

రాజానగరం: సీతానగరం మండలంలోని ఇనుగంటివారిపేటలో వివాహిత భవాని (40) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఇనుగంటివారిపేట పుట్టిల్లు అయిన భవానికి సీతానగరానికి చెందిన పి.కృష్ణతో వివాహం అయింది. చదువుకుంటున్న కుమారుడు, కుమార్తె ఉన్నారు. భవాని శ్రీరామనగరం వద్దగల కర్రీ పాయింట్‌లో పని చేసేది. ఆత్మహత్యకు కుటుంబ కలహాల కారణం అయి ఉంటుందని సమాచారం. భవాని తన పుట్టింటి వద్ద ఈ అఘాయిత్యానికి పాల్పడింది. ఈ విషయమై తమకు ఫిర్యాదు అందలేదని సీతానగరం ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు.

మహిళను కాపాడిన పోలీసులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రోడ్డు కం రైల్వే వంతెనపై నుంచి గోదావరి నదిలోకి దూకిన మహిళను స్థానిక జాలర్లు, పోలీసులు చాకచక్యంగా కాపాడారు. నగరానికి చెందిన వివాహిత సాయంత్రం సమయంలో బ్రిడ్జి మీదకు వచ్చి నడుచుకుంటూ వెళ్లి ఒక్కసారిగా గోదావరి నదిలో దూకింది. దీన్ని చూసిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెంటనే జాలర్లను అప్రమత్తం చేశారు. జాలర్లు పడవతో ఆమె దూకిన ప్రాంతానికి చేరుకుని ఆ మహిళను రక్షించారు. కుటుంబ కలహాల నేపథ్యంలో తాను ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించానని ఆ మహిళ పోలీసులకు తెలిపింది. దీంతో పోలీసులు ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆమెను ప్రాణాలతో రక్షించిన జాలర్లను, టుటౌన్ ఎస్సై రత్తయ్య, కానిస్టేబుల్ లీలకుమార్‌లను అందరూ ప్రశంసించారు.

శిరసా ధరించాల్సిందే!

- ఇక హెల్మెట్ ధారణ తప్పనిసరి
- ఢిల్లీ హైకోర్టు తీర్పుతో అమలుకు అధికారుల సన్నాహం
- వాహనదారులకు అవగాహన సదస్సుల ఏర్పాటు



హెల్మెట్


హెల్మెట్ ధారణతో వాహనదారుడు

అలమూరు: వాహనదారుల భద్రతకు, రోడ్డు ప్రమాదాల్లో మృతుల సంఖ్యను తగ్గించేందుకు అప్పటి కేంద్ర ప్రభుత్వం 1988లో మోటారు వాహన చట్టం కింద హెల్మెట్ ధారణ తప్పనిసరి చేసింది. 2010లో ఐక్యరాజ్య సమితి ఆదేశాల మేరకు వాహనదారుడి వెనుక కూర్చున్న ప్రయాణికులు కూడా హెల్మెట్ ధరించాలనే నిబంధనలను అమలులోకి తెచ్చింది. దేశంలో ఏటా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో వేలసంఖ్యలో ప్రజలు మృత్యువాత పడుతున్న నేపథ్యంలో ఈ చట్ట నిబంధనలను అమల్లోకి తీసుకు వచ్చింది. అయితే తదనంతర కాలంలో హెల్మెట్ ధారణ అమలులో ప్రజా ప్రతినిధులు, అధికారులు ఉదాసీన వైఖరి అవలంబించడంతో చట్ట నిబంధనలకు విలువ లేకుండా పోయిందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. కేంద్ర, రాష్ట్రాల నిర్లక్ష్యం వల్ల మోటారు వాహన చట్టం సక్రమంగా అమలు కాక, ఏటా రోడ్డు ప్రమాద మృతుల సంఖ్య పెరుగుతూ వస్తోందని గతంలో ఓ న్యాయవాది ఢిల్లీ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. వాదోపవాదాల అనంతరం ఇటీవల హైకోర్టు వెలువరించిన తీర్పులో కేంద్ర మోటారు వాహన చట్టాన్ని సమర్థంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానాలను విధించాలని ఆదేశించింది. చట్టాన్ని పాటించడంలో విఫలమైతే చట్టంలో రూపొందించిన నిబంధనల మేరకు ట్రాఫిక్ జరిమానాలు భారీగా విధించాలని ఆదేశించింది. అలాగే తీవ్రత, పరిస్థితులను బట్టి డ్రైవింగ్ లైసెన్స్‌ను మూడు నెలల వరకు రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని హైకోర్టు తీర్పులో పేర్కొంది.

అమలు దిశగా చర్యలు తీసుకుంటున్న రవాణాశాఖ

మోటారు వాహన చట్ట ఉల్లంఘనలపై రవాణాశాఖ తీసుకుంటున్న చర్యలేంటని హైకోర్టు ప్రశ్నించడంతో రవాణా శాఖాధికారులు అప్రమత్తమై చర్యలు చేపట్టవలసిన పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రంలో మోటారు వాహన చట్టాన్ని కఠినంగా అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం హుటాహుటిన ఏపీ లీగల్ సర్వీసెస్ అథారిటీకి బాధ్యతను అప్పగించింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో నున్న కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరం, పెద్దాపురం, రావులపాలెం, మండపేట రవాణాశాఖ ప్రాంతీయ కార్యాలయాల పరిధిలో సుమారు 48.7 లక్షల ద్విచక్ర వాహనాలు, 1.35 లక్షల నాలుగు చక్రాల వాహనాలు ఉండగా సుమారు 40 లక్షల లైసెన్స్‌లు జారీ అయ్యాయి. మండపేట రవాణాశాఖ పరిధిలోని ఏడు మండలాల్లో 18.2 లక్షల ద్విచక్ర, 24.23 వేల నాలుగు చక్ర వాహనాలు ఉండగా సుమారు 11.5 లక్షల లైసెన్స్‌లు జారీ అయ్యాయి. జిల్లాలోని వివిధ రహదారుల్లో ఏటా దాదాపు ఐదు వేల వరకూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అందులో మూడోవంతు ప్రమాదాలు హెల్మెట్ ధారణ చేయకపోవడం వల్లే అని తెలుస్తోంది. దేశంలో రహదారులపై ద్విచక్ర వాహనాల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతుండటంతో, హెల్మెట్ ధారణ ప్రాముఖ్యం బాగా పెరిగింది. దీంతో కొత్త ద్విచక్ర వాహనాన్ని కొనుగోలు చేసిన రోజునే హెల్మెట్ తీసుకోవలసిన నిబంధనను రవాణాశాఖ విధించింది. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) సర్టిఫైడ్ హెల్మెట్లను ధరించాలని, తలకు సరిపోయే విధంగా సౌకర్యవంతమైన హెల్మెట్‌ను ఎంచుకోవాలని రవాణాశాఖ చెబుతోంది.

ఇలా చేయాలి

- ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాల నుంచి రక్షణ పొందవచ్చుననే అవగాహన పెంచాలి.
- హెల్మెట్ ధరించకపోవడం వల్ల సంభవించే దుష్ప్రభావాల గురించి వివరించాలి.
- వాహన చట్ట నిబంధనల గురించి ప్రజలకు విరివిగా అవగాహన సదస్సులు నిర్వహించాలి.
- హెల్మెట్ ధారణ వల్ల కలిగే ప్రయోజనాలు, ధరించకుంటే జరిగే ప్రాణ నష్టాన్ని తెలియజేసే విధంగా దిన పత్రికల్లో ప్రకటనలు ఇవ్వాలి.
- రోడ్లపై విధులు, వాహన తనిఖీలు నిర్వహించే పోలీసు అధికారులు తప్పనిసరిగా బాడీ కెమెరాలు ధరించేలా చర్యలు తీసుకోవాలి.
- మోటారు వాహన చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరించాలి.
- విస్తృత ప్రయోజనాల రీత్యా అవసరమైతే వాహనదారులకు జరిమానా విధించాలి.
- ప్రస్తుత నిబంధనల ప్రకారం వాహనాన్ని నడిపే వారితో పాటు వెనుక కూర్చున్న వ్యక్తి కూడా హెల్మెట్ ధరించే విధంగా చర్యలు తీసుకోవాలి.

ప్రయోజనాలివీ..

- ద్విచక్ర వాహనం నడుపుతున్నప్పుడు హెల్మెట్‌ను ధరిస్తే ప్రాణాప్రాయ స్థితి నుంచి రక్షణ పొందవచ్చు.
- హెల్మెట్‌లు తల లేదా మెదడుకు తీవ్రమైన గాయం కాకుండా రక్షణ కల్పిస్తాయి.
- వాతావరణ పరిస్థితుల్లో కూడా హాయిగా శ్వాస పీల్చుకోవడానికి, చల్లగా ఉండటానికి హెల్మెట్ వీలు కల్పిస్తుంది.
- హెల్మెట్ ముఖానికి పూర్తిగా రక్షణ ఇస్తుంది.
- ముఖ కవచంతో కూడిన హెల్మెట్‌లు గాలి, దుమ్ము ప్రభావాన్ని తగ్గించడం ద్వారా దృశ్యమానతను మెరుగుపరచడంలో సహాయపడతాయి.
- బైక్‌ను నడుపుతున్న వాతావరణ పరిస్థితుల్లో వాంఛనీయమైన వెంటిలేషన్‌ను అందించే హెల్మెట్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి.
- భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండే తేలికపాటి హెల్మెట్ సౌకర్యంగా ఉంటుంది. దీనివల్ల సుదీర్ఘ ప్రయాణాల్లో మెడ నొప్పిని కలిగించే అవకాశం ఉండదు.

ప్రత్యేక ప్రణాళిక సిద్ధం



భద్రతా మాసోత్సవాల పేరిట ఏటా హెల్మెట్ ధారణపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం. తరచూ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసి జరిమానాలను విధిస్తున్నాం. జిల్లాలోని వివిధ శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ వాహనదారులందరూ స్వచ్ఛందంగా హెల్మెట్ ధరించే విధంగా ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేశాం.

– డి.అశోక్ ప్రతాప్‌రావు, రవాణాశాఖ ప్రధాన అధికారి, అమలాపురం

అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం) : క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో జరుగుతున్న పోటీల్లో ఎంపికై, అంతర్జాతీయ స్థాయిలోనూ రాణించాలని పలువురు వక్తలు ఆకాంక్షించారు. శుక్రవారం స్థానిక చెరుకూరి కన్వెన్షన్ హాల్లో శుక్రవారం జిల్లా ఉషూ అసోసియేషన్ ఆధ్వర్యంలో పదవ ఆంధ్రప్రదేశ్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్స్ ఉషు చాంపియన్ షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. రౌతు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులంతా తమ ప్రతిభను చాటి జాతీయ స్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు.

ఉషూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఆదిశేషు మాట్లాడుతూ ఈ పోటీల్లో ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేసి వచ్చే నెలలో తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూర్‌లో జరిగే జాతీయ పోటీలకు పంపుతామని తెలిపారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అజ్జరపు వాసు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీలు రాజమహేంద్రవరంలో జరగడం గర్వకారణంగా ఉందన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.సుందరం మాట్లాడుతూ ఈ పోటీలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 112 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. రెండు రోజులపాటు జరిగే ఈ పోటీలు పది విభాగాల్లో నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహారావు, సంయుక్త కార్యదర్శులు టి.శ్రీనివాసరావు, ఆర్.శివకుమార్, కోశాధికారి ఆర్.వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు కె.వెంకటేష్, నెక్కెళ్ళ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి క్షేత్రంలో భక్తుడి కారు దగ్ధం

మంటలు ఆర్పిన స్థానికులు, ప్రయాణికులు


ద్వారకాతిరుమలలో రోడ్డుపై దగ్ధమవుతున్న భక్తుడి కారు

ద్వారకాతిరుమల: ఒక భక్తుడి కుటుంబం ప్రయాణిస్తున్న కారులోంచి అకస్మాత్తుగా మంటలు, పొగలు వచ్చాయి. దాంతో కారులో ప్రయాణిస్తున్న వారు, రోడ్డుపై వెళుతున్న వాహనదారులు ఒక్కసారిగా భీతిల్లారు. ఈ ఘటన ద్వారకాతిరుమల క్షేత్రంలోని రాజస్థాన్ హోటల్ ఎదురుగా శుక్రవారం జరిగింది. వివరాల ప్రకారం.

భీమవరానికి చెందిన శివపు చల్లారావు శ్రీవారి దర్శనార్థం తన స్నేహితుడి కారులో కుటుంబ సమేతంగా క్షేత్రానికి విచ్చేశాడు. స్వామివారి దర్శనానంతరం టిఫిన్ చేసేందుకు వారు రాజస్థాన్ హోటల్‌కు వెళ్లారు. టిఫిన్ చేసిన అనంతరం స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యే క్రమంలో ఘటనా స్థలం వద్ద కారుని యూటర్న్ చేస్తుండగా, ఒక్కసారిగా బానెట్ నుంచి మంటలు, పొగలు వచ్చాయి. దాంతో భయాందోళనకు గురైన భక్తుడి కుటుంబ సభ్యులు కారులోంచి బయటకు దిగి, దూరంగా వెళ్లారు. స్థానికులు, ప్రయాణికులు కారు వద్దకు చేరుకుని పక్కనే ఉన్న మంచినీటి పైప్ ద్వారా మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. అరగంట తరువాత మంటలు ఆరడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. బ్యాటరీ వద్ద షార్ట్ సర్క్యూట్ జరగడం వల్లే ప్రమాదం సంభవించినట్టు గుర్తించారు. కారు ముందు భాగం పూర్తిగా దగ్ధమైంది.

చాగల్లులో భారీ చోరీ

బంగారం, వెండి వస్తువులు మాయం

చాగల్లు: మాజీ గ్రామ సర్పంచ్, మాజీ ఎంపీపీ కేత సాహెబ్ ఇంట్లో దొంగలు చొరబడి బంగారం, వెండి వస్తువులు తోపాటు నగదును అపహరించుకుపోయినట్లు ఎస్సై పి.నాగరాజు తెలిపారు. కేత సాహెబ్ గురువారం మధ్యాహ్నం ఊరికి వెళ్లారు. శుక్రవారం ఉదయం పనిమనిషి వచ్చింది. తలుపుల తాళాలు పగుల కొట్టి ఉండటాన్ని ఆమె గమనించింది. వెంటనే ఆయనకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చింది. కేతాసాహెబ్ చాగల్లు వచ్చి చూడగా ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. సుమారు 100 తులాల వెండి వస్తువులు, 24 కాసుల బంగారం, 25,000 నగదు కనిపించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నట్టు ఎస్ఐ నాగరాజు తెలిపారు. క్లూస్ టీంను రప్పించి ఇంటిని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆన్‌లైన్ మార్కెటింగ్ యాప్‌తో మోసం

పోలీసులకు బాధితుల ఫిర్యాదు

రామచంద్రపురం రూరల్: జీఎంఆర్ ఆన్‌లైన్ మార్కెటింగ్ యాప్ ద్వారా రూ.లక్షల్లో నష్టపోయామని, న్యాయం చేయాలని కోరుతూ 35 మంది బాధితులు శుక్రవారం ద్రాక్షారామ పోలీసులను ఆశ్రయించారు. ద్రాక్షారామ పరిసర ప్రాంతాలకు చెందిన వీరు ఈ యాప్‌లో వీఐపీ 1 కేటగిరీ నుంచి వీఐపీ 2, వీఐపీ 3 ఇలా వీఐపీ 9 వరకు గల కేటగిరీల్లో చేరి తమ సొమ్మును పోగొట్టుకున్నామని వివరించారు. గత ఏడాది నవంబర్ నెలలో ప్రారంభమైన ఈ యాప్‌ను తెలుగు రాష్ట్రాల్లో బుక్కూరి ఆనంద్, మద్దాల వినయ్‌కుమార్, మోటుపల్లి కిరణ్‌కుమార్ అనే వ్యక్తులు పరిచయం చేశారన్నారు. ఈ ముగ్గురి ద్వారా గ్రూపులో వెయ్యి మందికి పైగా సభ్యులుగా చేరి లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి నష్టపోయామన్నారు. ఈ ముగ్గురు సభ్యులను విచారించి తమకు న్యాయం చేయాలని ద్రాక్షారామ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ద్రాక్షారామ ఎస్సై జి.సురేంద్ర వివరణ కోరగా సరైన వివరాలతో రావాల్సిందిగా బాధితులకు సూచించామన్నారు.


ద్రాక్షారామ పోలీస్ స్టేషన్ వద్ద ఆన్‌లైన్ యాప్ బాధితులు

ఊబిలో కూరుకుపోయి...

తాళ్లరేవు: పి.మల్లవరం పంచాయతీ పరిధిలోని గ్రాంటు గ్రామంలో మంచినీటి చెరువును శుభ్రం చేస్తుండగా ఊబిలో కూరుకుపోయి కొప్పాడి అచ్చియ్య(48) మృతి చెందినట్టు కోరంగి హెడ్‌కానిస్టేబుల్ లోవరాజు తెలిపారు. ఆయన కథనం మేరకు ఐ.పోలవరం మండలం భైరవపాలెం గ్రామానికి చెందిన అచ్చియ్య కుళాయి చెరువు పూడికతీత పనులకు వచ్చాడు. చెరువులో అందరూ పనిచేస్తుండగానే లోతుగా ఉన్న ప్రాంతంలోకి వెళ్లి ఊబిలో కూరుకుపోయాడు. అది గమనించిన మిగతా కూలీలు అతనిని వెలికితీయగా అప్పటికే మృతి చెందాడు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు లోవరాజు తెలిపారు.

లారీ ఢీకొని భర్త మృతి

భార్యకు తీవ్ర గాయాలు


ఘటనా స్థలంలో తీవ్ర గాయాల పాలైన భార్యాభర్తలు

కొత్తపేట: పాము కరిచిందని ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకుని తిరిగి ఇంటికి వస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి ఉదంతమిది. మండల పరిధిలోని వానపల్లి గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇళ్ల శ్రీనివాస పళ్లంరాజు మృతి చెందగా ఆయన భార్య లక్ష్మి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వానపల్లి శివారు సంఘంపాలెం గ్రామానికి చెందిన ఇళ్ల శ్రీనివాస పళ్లంరాజు శుక్రవారం ఉదయం కృషి ట్రాక్టరుతో వరి నారుమడి దమ్ము చేస్తుండగా పాము కరిచింది. దానితో తన భార్య లక్ష్మిని తీసుకుని కొత్తపేట ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకున్నారు. సాయంత్రం ఆ దంపతులు మోటార్ సైకిల్‌పై తిరిగి ఇంటికి వెళ్తుండగా వానపల్లి గణేష్ సెంటర్ మలుపు వద్ద ఎదురుగా వచ్చిన లారీ ఇద్దరినీ ఢీకొని పళ్లంరాజును కొంతదూరం లాక్కుపోయింది. లక్ష్మి పడిపోయి తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు, బంధువులు అమలాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పళ్లంరాజును వైద్యులు పరీక్షించి అప్పటికే చనిపోయినట్టు నిర్ధారించారు. లక్ష్మి చికిత్స పొందుతున్నారు. మృతుని చిన్నాన్న కుమారుడు ఇళ్ల నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు కార్మికులకు తీవ్ర గాయాలు

అమలాపురం రూరల్: మండలంలోని ఈదరపల్లిలో 132 కేవీ ట్రాన్స్‌కో విద్యుత్ సబ్ స్టేషన్‌లో శుక్రవారం చోటు చేసుకున్న విద్యుదాఘాతానికి ఇద్దరు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. సబ్‌స్టేషన్‌లో అంబాజీపేట ఎల్‌టీ లైన్ మరమ్మతులను చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. గన్నవరానికి చెందిన ఉమామహేశ్వరరావు, ముమ్మిడివరం మండలం గెదేల్లంకకు చెందిన బత్తుల ప్రకాశం విద్యుత్ షాక్‌కు గురయ్యారు. గాయపడిన కార్మికులను హుటాహుటిన అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. వీరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గాయాలైన ఇద్దరు సిబ్బంది ఆరోగ్యం నిలకడగానే ఉంది. వీరు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.

ఖరీఫ్‌ను ఇలా కాపాడుకోవాలి

- నారుమడిలో ఆధునిక పద్ధతులు పాటించాలి
- వరి నాట్ల సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి
- త్వరగా వరినాట్లు వేస్తే మూడో పంట సాధ్యమే


ఓలేటి బోసుబాబు, వ్యవసాయాధికారి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా


ఆలమూరులో ఆకుతీత పనిలో రైతు కూలీలు


సస్యరక్షణ చర్యలు చేపట్టడంతో తేరుకుంటున్న మునిగిన నారుమడి

పాడి-పంట

ఆలమూరు: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. రైతులు వరి నాట్లు ముమ్మరం చేశారు. నారుమళ్లు, ఆకు తీత, వరినాట్లు వేసేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల్లోని వివిధ గ్రామాల్లో గత ప్రభుత్వం నెలకొల్పిన రైతు భరోసా కేంద్రాలు రైతులకు అండగా నిలుస్తున్నాయి. వివిధ ప్రాంతాల్లో సాగునీరు, విత్తనాల లభ్యత తదితర అంశాల ఆధారంగా నారుమళ్లు ఏర్పాటు చేసుకోవడం దగ్గర నుంచి వరి నాట్లు వేసుకునే వరకూ వివిధ దశల్లో వ్యవసాయ పనులు జరుగుతున్నాయి. వ్యవసాయశాఖ సూచనల మేరకు వరిసాగులో తగిన జాగ్రత్తలు తీసుకుని సమయ పాలన పాటిస్తే నాణ్యమైన పంటలతో పాటు అధిక దిగుబడి సాధించవచ్చు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు త్వరితగతిన వరినాట్లు ప్రక్రియను పూర్తి చేస్తే రాబోయే రబీ సీజన్ తరువాత మూడవ పంట వేసుకునేందుకు అవకాశం ఉంటుందని జిల్లా వ్యవసాయాధికారి ఓలేటి బోసుబాబు సూచిస్తున్నారు. ముందస్తుగా ఖరీఫ్ పనులు పూర్తి చేస్తే ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని చెప్పారు.

- వ్యవసాయ శాఖ సూచనలకనుగుణంగా ఈ నెలాఖరు నుంచి జూలై 12లోపు వరి నాట్ల ప్రక్రియ పూర్తి చేస్తే సమయం ఆదా అవుతుంది.
- రబీ సీజన్ తరువాత మూడవ పంటగా పచ్చిరొట్ట, జనుము, జీలుగు తదితర పంటలు సాగు చేస్తే భూసారం పెరుగుతుంది.
- అపరాల సాగుకు ఆసక్తి లేకపోతే ఎక్కువ రోజులు భూమిని ఖాళీగా ఉంచితే భూసారం పెరుగుతుంది.
- ఖరీఫ్, రబీ పంట త్వరితగతిన సాగు చేసుకోవడం ద్వారా ప్రకృతి వైపరీత్యాల నుంచి చీడపీడలు, తెగుళ్ల బారి నుంచి తప్పించుకోవచ్చు.
- ఖరీఫ్ పంట త్వరగా ముగిస్తే రబీ పంట కూడా త్వరగా కోతకు వస్తుంది. దీనివల్ల నీటి ఎద్దడిని అధిగమించవచ్చు.
- రాబోయే ఏడాది మార్చి నెలాఖరు నాటికి పంట కాలువలను మూసివేసినా రబీ పంటకు ఏవిధమైన నష్టం - వాటిల్లే అవకాశం ఉండదు.

వరి నాట్ల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు

- వరి నారుమడి వేసే ముందు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేయాలి.
- నారు వేయడానికి పక్షం రోజుల ముందు పొలాన్ని మురుగు దమ్ము చేయాలి
- 15 సెంటీమీర్లకు మించి లోతుగా దమ్ము చేయరాదు.
- పొలాన్ని దమ్ము చెక్కతో కాని, యంత్రపరికరంతో గాని చదును చేయాలి.
- నారుమడి లేత ఆకు రంగులో ఉన్నప్పుడే నాటడం ద్వారా త్వరగా మూన కడుతుంది.
- నాలుగు నుంచి ఆరు ఆకుల ఉన్న నారును ఉపయోగించుకుంటే ఫలితం ఉంటుంది.
- నారు పైపైన ఉండే విధంగా నాటితే పిలకలు ఎక్కువగా తొడిగే అవకాశం ఉంటుంది.
- నారు వేసేటపుడు భూసారాన్ని బట్టి చదరపు మీటరుకు 33 మూనలు ఉండేలా నాటాలి.
- వరినాట్ల తరువాత ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల చొప్పున బాటలు వేయాలి. దీనివల్ల పైరుకు వెలుతురు తగిలి చీడపీడల నివారణకు దోహదపడుతుంది.

నారుమడి మునిగితే ఇలా చేయాలి

- నారుమడిలో బాటలు వేసి నీటిని తొలగించాలి.
- మొక్కలు కోలుకోవడానికి ఎకరా నారుమడికి యూరియా, పొటాష్ ఎరువులను 10 కేజీల చొప్పున అందించాలి.
- నారుమడికి తెగుళ్లు సోకకుండా లీటరు నీటిలో రెండు గ్రాముల కార్బన్‌డిజమ్, 2.5 మిల్లీగ్రాములు క్లోరోపైరీపాస్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి.
- నారుమళ్లు పూర్తిగా దెబ్బతింటే రైతులు ప్రత్యామ్నాయంగా వెదజల్లు విధానాన్ని అవలంబించి సమయం, పెట్టుబడిని ఆదా చేసుకోవాలి.
- వ్యవసాయశాఖ సూచనలు, సలహాలను తీసుకుంటే నారుమడి దెబ్బతిన్న రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది.